# 11. గుగ్గలు కలశ నాయనారు

చోళదేశమున తిరుక్కడవూరులో గుగ్గలు కలశనాయనారు జన్మించాడు. ఆయన బ్రాహ్మణుడు. అక్కడ దైవము పేరు అమృతఘటేశ్వరుడు. దేవతలు, అసురులు అమృత కలశంతో ఆ వూరు వచ్చారు. వారు స్నానము చేయుదము అనుకొన్నారు. ఆ కలశాన్ని నేలపై నుంచి నదికి స్నానమునకు వెళ్లారు. వారు తిరిగి వచ్చి ఆ కలశమును తీసికొందామంటే నేలనుంచి అది పైకి రాలేదు. ఆ కలశం లింగంగా మారింది. అందుకని ఆ లింగాన్ని అమృత లింగం అంటారు. మార్కండేయుడు ఈ లింగంకే తపస్సుచేసి తన 16వ ఏట అమరుడయ్యాడు. ఇక్కడ అమ్మవారు అభిరామి అమ్మన్. అభిరామపట్టార్ ఈ అమ్మన్కు పరమభక్తుడు. అమె మీద ఎన్నో కీర్తనలు పాడాడు. అభిరామపట్టార్ యందు అమ్మకు అనుగ్రహం మెండైంది. రాజుగారి ఆగ్రహము నుండి ఈ పట్టార్ను తప్పించుటకు ఈమె అమావాస్యను పౌర్ణమిగా మార్చింది కూడ.

గుగ్గలు కలశనాయనారు ఈ ఆలయమున శివునికి ప్రతిదినము గుగ్గిలముతో ధూపము వేయుచు పూజ చేయువాడు. ఈకారణముచే అతనికి గుగ్గలుకలశ నాయనారు అను పేరు వచ్చింది. గుగ్గలము ధూపము శివునికి మంచి సేవ అనుకున్నాడు. చేతిలో ఒక చిన్నకుంపటి, అగ్ని, గుగ్గిలము పుచ్చుకొని నిరంతరము గుగ్గిలము ధూపము వేయుచు అర్చిస్తూ గడిపేవాడు.

ఈ భక్తుని సేవా విశేషము, అతని శివార్చన తపన పరమశివుని పరవశింప జేశాయి. అతని పరమభక్తి విశేషాలు ప్రపంచానికి చూప నిశ్చయించాడు.

శివుని సంకల్పమున నాయనారు కటిక పేదవాడయ్యాడు. ఆస్తి అంతా అమ్ముకోవలసి వచ్చింది. కుటుంబము పస్తుంటున్నది. అయినా నాయనారు తన గుగ్గిలం సేవలు మానలేదు. ఒకరోజున భార్య అనుకుంది. అంతా అమ్మబడింది. ప్రతి స్త్రీ భర్త చనిపోవునంత వరకు అట్టిపెట్టుకోవలసిన మాంగల్యము మాత్రము మిగిలి వుంది. భర్త పిల్లలు ఆకలితో నకనకలాడుతున్నారు. అని ఆలోచించి మెడలో పుస్తెలతో పసుపు కొమ్ము వుంచు

కొని తన బంగారు మాంగల్యమును భర్తకు తీసి యిచ్చి - దీనినమ్మి ధాన్యము తీసికొని రండు అని భర్తను బ్రతిమాలింది. అతడు అది పుచ్చుకొని అంగడికి బయలు దేరాడు. బజారునకు పోవుచుండగా ఒక వర్తకుడు గుగ్గిలము మూటలను భుజముల మీద నుంచుకొని విక్రయించుటకు ఎదురు వచ్చుచుండగా అది చూచి - నాయనారు - “ధాన్యము కొనుటకంటే  దేవునికుపయోగింపవచ్చును గుగ్గిలము కొనుట చాలా మంచిది” అని మంగళసూత్రమునిచ్చి, వర్తకుని నుండి గుగ్గిలము మూటలను ఆలయమునకు తీసికొని వెళ్లి యథారీతిన గుగ్గిలము ధూపముతో తపోమగ్నుడయ్యాడు.

భార్యాపిల్లలు క్షుద్బాధ తట్టుకోలేక అలసి పడుకున్నారు. ఝామురాత్రి అయినా భర్త తిరిగి రాలేదు. దైవమును ప్రార్థింప మొదలిడింది. తనకు అతి పవిత్రమైన మాంగల్యమును కూడా భర్తా పిల్లల ఆహారము కొఱకు పసుపుకొమ్ముతో సరిపెట్టుకొని ఇచ్చింది. అయినా పరమేశ్వరా ఇలా అయింది రక్షింపు అని ప్రార్థించింది. ఆమె ప్రార్థనకి, నాయనారు భగవత్‌సేవ నిష్ఠకు, వారి మంచితనము, పవిత్రతకు పరమేశ్వరుడు చాలా సంతుష్టి చెందాడు.

కురాల్‌లో : “పతిని దైవముగను వ్రతమున్న ఇల్లాలు
కురియుమన్న క్షణమె కురియువాన”

ఆమె కలలో శివుడు కన్బడి “ నీకు సకల సౌభాగ్యాలు ఇస్తున్నాను” అన్నాడు.

ఆమె మేల్కొనగానే ఆమె చకితురాలగునట్లుగా - గృహము సకల సంపత్తులతో నిండిపోయింది.

వెంటనే ఆమె పరవశంతో పరమేశ్వరుని వినుతించింది. ఆయనపై పాటలు పాడింది. మహానంద భరితురాలై వెంటనే వంటచేసి తన బిడ్డలకు అన్నము పెట్టి భర్త రాకకై వేచి వుంది.

అట ఈశ్వరుడు నాయనారును ‘ఆకలిగొని యున్నావు, ఇంటికి పోయి భుజింపుము’ అని ఆదేశించాడు.

ఇంటికి పోగా అతనికి ఆశ్చర్యమైంది. ఈ భాగ్యమంతా ఎలా వచ్చింది అని భార్య

నడిగాడు. అమె జరిగింది చెప్పింది. శివానుగ్రహమునకు, తాను అక్కడ చేరిన శివభక్తులును కలిసి శివుని బహుధా కీర్తించారు. నాయనారు ఈ సంపద తనదిగా భావించలేక పోయాడు. “ఇదంతా శివునిది - దీనిని శివభక్తులకే వినియోగించాలి” అని అంటూ - వాని నిరంతర సేవ కొనసాగించాడు.

ఒక రోజున నాయనారు తిరుప్పనందాళ్ దేవాలయము సందర్శిద్దామనుకొన్నాడు. అరుణ సతీశుని దేవాలయము అచట నున్నది. ఒక రాక్షసుని కుమార్తె తాటక, పుత్రునికై అచ్చట శివలింగాన్ని రోజూ అర్చించేంది. ఒకరోజున ఆ లింగమును పుష్పహారముతో అలంకరిద్దామని పూలదండను ఎత్తిపట్టుకోబోయింది. ఆమె వస్త్రము నడుము నుంచి జారబోయింది. వస్త్రమును రెండుమోచేతులతో అదిమి పెట్టింది. అందుకని ఆమె  చేతులు ఎత్తలేక పోయింది. ఆమె బెడద  నుండి ఆమెను తప్పించుటకు శివుడు ఒక ప్రక్కకు ఒరిగి(ఒంగి) ఆమె దండను స్వీకరించాడు. ఆ లింగము అట్లనే ఒరిగి వుండి పోయింది. చాలామంది ఆ లింగంను సరిపెట్ట ప్రయత్నించారు. వీలుకాలేదు. రాజుగారు ఆ వంపుకు మోకులు తాళ్ల కట్టించి ఏనుగులతో లాగించారు. ప్రయోజనము కలుగలేదు. రాజుగారికి ఏమీ పాలుపోలేదు.

ఈ సంగతి గుగ్గులు కలశనాయనారుకు తెలిసింది. అచ్చటికి వెళ్లి “నేను గూడ కొంచెము ప్రయత్నించెదను” అని ఆ శివలింగం వంపును తాడుతో బిగించి ఆ తాడు కొసను తన మెడకు కట్టుకొని శివుని ధ్యానము చేస్తూ లాగాడు. తోడనే లింగము వంపు సరి అయి యథాస్థితికి వచ్చింది. దేవతలు పుష్పవృష్టి కురిపించారు.

రాజు దానిని చూచి “ఈతడు భక్తి రజ్జువుచే ఇట్లు చేయగలిగాడు” అని తెలిసికొని నాయనారును చాలా గౌరవించి అనేక విధముల సన్నుతి చేశాడు. అందరికి నాయనారు భక్తి ప్రపత్తులు వెల్లడయ్యాయి.

కొన్ని దినములకు వాగేశనాయనారు, జ్ఞాన సంబంధనాయనారు అచటికి వచ్చారు. గుగ్గలు కలశనాయనారు వారిని అనేక విధముల సంభావించి బ్రతికియున్నంత కాలము శివసేవలోను, శివభక్తుల సేవలలోను గడిపి అంత్యమున శివసాయుజ్య మొందినాడు.